సర్కార్ స్కూళ్లల్లో పరిశుభ్రతకు నిధులు

- 4 నెలల ఆలస్యంగా కేటాయింపు
- స్లాబుల ఆధారంగా 3వేల నుంచి 20వేలు విడుదల
- 'సీఎం హామీ నీటి మూటలేనా' అంటూ 'నమస్తే' కథనం
- స్పందించిన రేవంత్ సర్కారు... ఉత్వర్వులు జారీ

నమస్తే ఎఫెక్ట్

హైదరాబాద్, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ): సర్కారు బడుల పరిశుభ్రతకు నాలుగు నెలలు ఆలస్యంగా రేవంత్ సర్కారు నిధులు కేటాయించింది. బడులు ప్రారంభమైన రెండు నెలల తర్వాత పాఠశాలల పరిశుభ్రత బాధ్యత 'అమ్మ ఆదర్శ పాఠశాల' కమిటీలకు అప్పగిస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది. కేవలం పరిశుభ్రత నిర్వహించేవారికి గౌరవ భత్యం చెల్లించడానికి మాత్రమే ఆ గ్రాంటు నిధులను వాడాలని తెలిపింది. పరిశుభ్రత కోసం పని చేసే వారి పేరు ఎక్కడా ఉండరాదని, కమిటీ పేరు మీదనే చెల్లించాలని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠశాలలకు నెలవారీగా పరిశుభ్రతకు గ్రాంటును కేటాయించారు. కనిష్టంగా రూ.3 వేలు, గరిష్టంగా రూ.20 వేల చొప్పున పది నెలల పాటు గ్రాంటు ఇవ్వనున్నారు. మార్చిలో ఉపాధ్యాయ సంఘాలతో నిర్వహించిన సమావేశంలో పారిశుధ్య కార్మికులను నియమించాలని సంఘాలు ముక్తకంఠంతో కోరాయి. అదే సభలో సీఎం రేవంత్‌రెడ్డి పారిశుధ్య కార్మికులను నియమిస్తామని హామీ ఇచ్చి విస్మరించారు. ఇటీవలే ఎల్బీ స్టేడియంలో టీచర్లతో ముఖాముఖి నేపథ్యంలో 'సీఎం హామీ నీటి మూట లేనా' అంటూ 'నమస్తే తెలంగాణ' కథనాన్ని ప్రచురించింది. దీంతో స్పందించిన సీఎం రెండు రోజుల్లోనే నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు విద్యాశాఖ ప్రత్యేకంగా జీవోను జారీ చేసింది.

గతంలో స్కావెంజర్లు !

గతంలో 28 వేల ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య పనులకు ఔట్ సోర్సింగ్ సర్వీస్ పర్సన్స్ పేరిట 28 వేల మంది వరకు పనిచేసేవారు. వీరికి గౌరవ వేతనం రూ.2500 ఇచ్చేవారు. కరోనా సమయంలో విద్యాసంస్థలు మూసివేయడంతో వీరిని తొలగించి, పంచాయతీరాజ్ , మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ విభాగానికి బాధ్యతలు అప్పగించారు. ఆయా శాఖలు సమర్థవంతంగా నిర్వహించకపోవడంతో టీచర్లే స్కావెంజర్లను నియమించుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ బాధ్యతను అమ్మ ఆదర్శ కమిటీలకు అప్పగించింది. గ్రాంటు నిధులపై పీఆర్టీయూ, టీజీయూటీఎఫ్, ఎస్‌టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పింగళి శ్రీపాల్‌రెడ్డి, జంగయ్య, పర్వత్ రెడ్డి, కార్యదర్శులు బీరెల్లి కమలాకర్‌రావు, చావా రవి, సదానందం గౌడ్ వర్షం వ్యక్తం చేసి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

ఎన్‌రోల్ మెంట్ స్లాబ్	నెలకు ఒక్కో స్కూలుకు
1 నుంచి 30	రూ.3 వేలు
31 నుంచి 100	రూ.6 వేలు
101 నుంచి 250	రూ.8 వేలు
251 నుంచి 500	రూ.12 వేలు
501 నుంచి 750	రూ.15 వేలు
750 మంది కంటే ఎక్కువ	రూ.20 వేలు

పురుగుల అన్నంపై ప్రశ్నిస్తే కొడ్తుండ్రు

తల్లిదండ్రులతో కన్నీరు పెట్టుకున్న విద్యార్థినులు

పెంట్లవెల్లిలో కేజీబీవీ వద్ద తల్లిదండ్రులతో కన్నీరు పెట్టుకుంటున్న విద్యార్థినులు

పెంట్లవెల్లి, ఆగస్టు 5 : పురుగుల అన్నం పెడుతున్నారని ఎస్‌వో స్వప్న మేడానికి ఫిర్యాదు చేస్తే గిన్నెతో కొట్టారని కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థినులు సోమవారం తల్లిదండ్రులతో కంటతడి పెట్టుకున్నారు. ఆదివారం రాత్రి నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి కేజీబీవీలో 30 మంది విద్యార్థినులు ఫుడ్‌పాయిజన్‌కు గురై దవాఖానలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిన విద్యార్థినుల తల్లిదండ్రులు విద్యాలయానికి చేరుకున్నారు. విద్యార్థినులు పేరెంట్స్‌తో మాట్లాడుతూ 'మాకు ఈ పాఠశాల వద్దు.. మీ వెంటే మేము వస్తాం..' అంటూ కన్నీరు పెట్టుకున్నారు. ప్రజాపాలన పేరుతో గద్దెనెక్కిన రేవంత్ సీఎం అయ్యాక విద్యాశాఖకు మంత్రిని నియమించలేదని ధ్వజమెత్తారు. పురుగుల అన్నం, కుళ్లిపోయిన కూరగాయలతో వంటచేసి పెడుతున్నారని వాపోయారు. ఎస్‌వోను వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. అందుబాటులోకి రాలేదు.

ఆర్థిక మాంద్యంలో పెట్టుబడులా?

- సీఎం అమెరికా పర్యటనపై కార్పొరేట్ వర్గాల్లో చర్చ
- అధ్యక్ష ఎన్నికల్లో తలమునకలైన అమెరికా
- విపత్కర వేళ పెట్టుబడులు ఎలా సాధ్యమని ప్రశ్నలు
- 'మరో దావోసేనా?' అంటూ అనుమానాలు

హైదరాబాద్, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన విజయవంతమవుతుందా అని కార్పొరేట్ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ప్రస్తుతం అమెరికా ఆర్థిక మాంద్యం అంచున ఊగిసలాడుతున్నది. అమెరికా ఆర్థిక మాంద్యం భయంతోనే సోమవారం స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. మన దేశంలో ఒకే రోజు రూ.15 లక్షల కోట్ల మేర ఇన్వెస్టర్ల సంపద ఆవిరైంది. మరోవైపు అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు జరుగుతున్నాయి. కార్పొరేట్ కంపెనీలు సైతం కొత్త అధ్యక్షుడికి తగ్గట్టుగా తమ పాలసీలు మార్చుకోవాలనే ఉద్దేశంతో ఎన్నికలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రతినిధి బృందం పెట్టుబడులు సాధిస్తుందా? అన్నది మార్కెట్ వర్గాల్లో మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ఇందుకు కాగ్నిజెంట్ ప్రకటనే ఉదాహరణగా చెప్తున్నారు. తెలంగాణలో 15 వేల ఉద్యోగాలు కల్పిస్తామని, 10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో క్యాంపస్ పెడతామని కాగ్నిజెంట్ ప్రకటించిందని సీఎంవో తెలిపింది. ఇదే సంస్థ గత ఏడాదిన్నర కాలంలో 7 వేల మంది ఉద్యోగులను తొలగించిందని, ఆఫీస్ స్పేస్ లీజును రద్దు చేసుకున్నదని చెప్తున్నారు. ఇలాంటి సంస్థ వ్యాపార విస్తరణ ఎలా చేపడుతుందని ప్రశ్నిస్తున్నారు.

మరో దావోసేనా?

సీఎం రేవంత్ ఈ ఏడాది జనవరిలో దావోస్ పర్యటనకు వెళ్లిన సందర్భంగా రూ.40 వేల కోట్ల పెట్టుబడులు సాధించామని, తెలంగాణ చరిత్రలోనే అత్యధికమని చెప్పుకొచ్చారు. ఈ పెట్టుబడుల్లో అత్యధికం బోగసని విమర్శలు వచ్చాయి. మూలధనమే లేని గోడి ఇండియా కంపెనీ రూ.8 వేల కోట్ల పెట్టుబడి ఎలా పెడుతుందని బీఆర్ఎస్ విమర్శించింది. జేఎస్ డబ్ల్యూ సంస్థ 2022లో చేసుకున్న రూ.9 వేల కోట్ల ఒప్పందాన్నే మళ్లీ చెప్పుకున్నారని ఆరోపించారు. అదానీ కంపెనీ ఇప్పటివరకు పెట్టుబడి పెట్టలేదని, పాతబస్తీలో కరెంటు బిల్లుల వసూలు అప్పగించారని విమర్శిస్తున్నారు. టాటా, జిందాల్, వెబ్ వర్క్స్, ఆరాజెన్, క్యూసెంట్రియో, ఓ9 సొల్యూషన్స్, గోడ్రెజ్, సర్జికల్ ఇన్‌స్ట్రుమెంట్స్.. కంపెనీలు వస్తాయని, 35 వేల ఉద్యోగాలు వస్తాయని చెప్పుకున్నారని, ఆ కంపెనీల్లో ఏవి గ్రౌండింగ్ అయ్యాయో బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. నాటి దావోస్ తరహాలోనే ఈసారి అమెరికా పర్యటన కూడా ఉత్తుత్తిదనే! అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణను ప్రత్యేక దేశంగా గుర్తించండి

- మీ సహకారంతో ప్రపంచంతో పోటీ
- రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురండి
- ప్రజలకిచ్చిన మాట నిలబెట్టుకున్నాం
- నాలుగో నగరంగా ఫ్యూచర్ సిటీ
- న్యూజెర్సీ ప్రవాసుల సమ్మేళనంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

హైదరాబాద్, ఆగస్టు 5(నమస్తే తెలంగాణ): తెలంగాణను దేశంలోని ఒక రాష్ట్రంగా భావించవద్దని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ స్వతంత్ర దేశమైతే ప్రపంచంతో ఎలా పోటీపడుతుందో, అలాగే మీ అందరి సహకారంతో ప్రపంచంతో పోటీ పడాలని అనుకుంటున్నట్టు తెలిపారు. అమెరికా పర్యటనలో ఉన్న రేవంత్‌రెడ్డి ఆదివారం న్యూజెర్సీలో ఏర్పాటు చేసిన ప్రవాసుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. రాష్ట్రానికి అత్యధిక పెట్టుబడులు తీసుకురావడంలో భాగస్వాములు కావాలని తెలుగు రాష్ట్రాల ప్రవాసులకు పిలుపునిచ్చారు. పొరుగు రాష్ట్రాలతో పోటీపడాలనుకోవడం లేదని, ప్రపంచంతో పోటీపడాలని అనుకుంటున్నట్టు చెప్పారు.

ప్రతిమాటను నిలబెట్టుకుంటాం

జన్మభూమి తెలంగాణలో పెట్టిన ప్రతి పెట్టుబడికి తప్పకుండా ప్రయోజనం ఉంటుందని సీఎం పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని తెలిపారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని సమ్మిళిత ఆర్థికాభివృద్ధి సాధించేలా కొత్త పారిశ్రామిక విధానాన్ని తీసుకొస్తుందని తెలిపారు. హైదరాబాద్‌ను ప్రపంచంలోనే అగ్రగామి నగరంగా అభివృద్ధి చేసేందుకు పోటీపడతామని పేర్కొన్నారు. ప్రతిభాపాటవాలతో అమెరికాను సంపన్నంగా మార్చారని ప్రవాసులను అభినందించిన రేవంత్‌రెడ్డి.. ఇకపై తెలంగాణలోనూ సేవలు అందించాలని స్వాగతించారు. ఈస్ట్‌కోస్ట్ ఇండియన్ కమ్యూనిటీకి చెందిన ముఖ్యులతో మాట్లాడిన రేవంత్‌రెడ్డి.. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ తరహాలో నాలుగో నగరంగా ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. హైదరాబాద్‌ను అభివృద్ధి చేసేందుకు అందరూ కలిసి రావాలని ప్రవాసులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా హైదరాబాద్ అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను, భవిష్యత్తు ప్రణాళికలను ఎన్నారైలు ప్రశంసించారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలనే ప్రచారంలో ప్రభుత్వంతో కలిసి పాల్గొంటామని హామీ ఇచ్చారు.

అమెరికాకు మంత్రి కోమటిరెడ్డి

రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సోమవారం సాయంత్రం అమెరికా బయలుదేరి వెళ్లారు. 7న అమెరికాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి ప్రవాస భారతీయ నాయకులతో జరిగే మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో పాల్గొంటారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ తవ్వకాన్ని వేగవంతం చేసేందుకు అవసరమైన అధునాతన బేరింగ్ మెషినరీని సమకూర్చేందుకుగాను 12న ఓహియోలోని రాబిన్స్ టన్నెల్ బేరింగ్ మెషినరీ తయారీ కంపెనీ సీఈవో లాక్‌హోమ్‌తో మంత్రి సమావేశమవుతారు.

ప్రొఫెసర్ జయశంకర్ స్ఫూర్తిని కొనసాగిస్తాం

సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 4 (నమస్తే తెలంగాణ): ప్రత్యేక రాష్ట్ర సాధనే ధ్యేయంగా జీవితాంతం గడిపిన ప్రొఫెసర్ జయశంకర్ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన సేవలను సీఎం గుర్తుచేసుకున్నారు. హైదరాబాద్ రాష్ట్రాన్ని ఆంధ్ర రాష్ట్రంలో విలీనం చేయడాన్ని జయశంకర్ వ్యతిరేకించారని గుర్తు చేశారు. ఏపీలో విలీనంతో జరిగిన అన్యాయాన్ని ఎప్పటికప్పుడు వివరిస్తూ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని ఆరు దశాబ్దాలు సజీవంగా ఉంచిన ఘనత ఆయనదేనని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం స్పష్టం చేశారు.

స్థానిక సంస్థల్లో స్పెషల్ ఆఫీసర్లు

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

హైదరాబాద్, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ): పదవీకాలం ముగిసిన మండల, జిల్లా పరిషత్‌లకు స్పెషల్ ఆఫీసర్లను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ములుగు, ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లా పరిషత్‌లకు జిల్లా కలెక్టర్లను, కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలోని అన్ని మండలాలు, ములుగు జిల్లా వాజేడు, వెంకటాపురం, మహబూబాబాద్ జిల్లా గార్ల, బయ్యారం మండల పరిషత్‌లకు ప్రత్యేక అధికారులను నియమించింది. కొత్త పాలకవర్గాలు ఎన్నికయ్యే వరకు వీరు కొనసాగుతారని పేర్కొంది.

మరో 3 రోజులు వర్షాలు

హైదరాబాద్, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రానున్న మూడు రోజులు మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా నేడు, రేపు ఈదురు గాలుల ప్రభావం ఉంటుందని తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా గత 24 గంటల్లో నిర్మల్ జిల్లా బాసరలో అత్యధికంగా 4.08 సెం.మీ వర్షపాతం నమోదైందని వెల్లడించారు.

స్కిల్ యూనివర్సిటీ చైర్మన్‌గా ఆనంద్ మహీంద్రా

వెల్లడించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 5(నమస్తే తెలంగాణ): స్కిల్ యూనివర్సిటీ చైర్మన్‌గా మహీంద్రా గ్రూప్ అధినేత ఆనంద్ మహీంద్రా వ్యవహరిస్తారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. అమెరికా పర్యటనలో ఉన్న సీఎం ఆదివారం న్యూజెర్సీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఈ విషయాన్ని వెల్లడించారు. స్కిల్ యూనివర్సిటీకి చైర్మన్‌గా వ్యవహరించేందుకు ఆనంద్ మహీంద్రా అంగీకరించారని, త్వరలోనే బాధ్యతలు స్వీకరిస్తారని తెలిపారు. రంగారెడ్డి జిల్లా ముచ్చర్ల కేంద్రంగా అభివృద్ధి కానున్న ఫ్యూచర్ సిటీ పరిధిలో బేగరికంచె వద్ద తెలంగాణ స్కిల్ యూనివర్సిటీ భవనానికి సీఎం గతవారం శంకుస్థాపన చేశారు. యూనివర్సిటీలో 17 రకాల కోర్సుల్లో ఏటా 20వేల మందికి శిక్షణ ఇచ్చి, సర్టిఫికెట్ ఇవ్వడంతోపాటు ఆయా కంపెనీల్లో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కూడా కల్పించే ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏడాది నుంచే ఆరు కోర్సులు ప్రారంభించనున్నట్టు సీఎం తెలిపారు. రాబోయే సంవత్సరాల్లో ఏడాదికి లక్ష మందికి శిక్షణ ఇచ్చేలా స్కిల్ వర్సిటీని విస్తరిస్తామని పేర్కొన్నారు. బేగరికంచెలో సొంత భవనం పూర్తయ్యే వరకు గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా భవనంలో స్కిల్ యూనివర్సిటీ కార్యకలాపాలు కొనసాగుతాయి.

నీట్ అడ్మిషన్లలో స్థానికులకు న్యాయం చేయాలి

హైదరాబాద్, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ): ఎంబీబీఎస్ అడ్మిషన్‌లో జీవో నంబర్ 33కు గత నెల 19న చేసిన అటాచ్ సవరణతో స్థానికత కోల్పోతున్న తెలంగాణ విద్యార్థులకు తగు న్యాయం చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు వారు సోమవారం రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రికి లేఖ రాశారు. కొన్నేండ్లుగా అమలవుతున్న నిబంధనల ప్రకారం 6 నుంచి 12వ తరగతి చదివిన ఏడేండ్ల కాలంలో గరిష్ఠంగా 4 సంవత్సరాలు ఎక్కడ చదివితే అక్కడ స్థానికులుగా పరిగణించేవారని, కానీ జీవో నంబర్ 33కు అటాచ్ చేసిన అమెండ్‌మెంట్‌తో 9 నుంచి 12వ తరగతులు వరుసగా తెలంగాణ రాష్ట్రంలో చదివితేనే స్థానికులుగా పరిగణించబడుతుందని, 9వ తరగతి కంటే ముందు ఎక్కడ చదివారనే దానిని పరిగణలోకి తీసుకోవడం లేదని తెలిపారు. వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ జారీ చేసిన ఈ జీవో ప్రకారం ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు తెలంగాణలో చదివి, ఇంటర్మీడియట్ ఏపీలో చదివిన తెలంగాణ విద్యార్థులు స్థానికతను కోల్పోతున్నారని పేర్కొన్నారు.

తిప్పి తిప్పి చేతులెత్తేసిన భట్టివిక్రమార్క

- రైతులను తిప్పించుకుని వదిలేసిన మంత్రి
- సమస్యలు వింటాం రమ్మని సమాచారం
- వచ్చాక ముఖం చాటేసిన డిప్యూటీ సీఎం

నాదర్‌గుల్ బస్టాండ్‌లో భట్టిని అడ్డగించిన రైతులు

బడంగ్‌పేట, ఆగస్టు 5: కలుద్దాం రమ్మని రైతులకు సమాచారం ఇచ్చి ఆపై కలవకుండా వెళ్లిపోయిన ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్కపై రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. సమస్యలు చెప్పుకునేందుకు వస్తే సమయం ఇవ్వకుండా అవమానించారని మండిపడుతున్నారు. సమయం ఇవ్వలేనప్పుడు పిలవడం ఎందుకని ప్రశ్నిస్తున్నారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కుర్మల్‌గూడ నల్లపోచ్చమ్మ దేవాలయంలో ఆదివారం జరిగిన బోనాల ఉత్సవాలకు మంత్రి హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి జనాన్ని పోగుచేసేందుకు భూములు కోల్పోయిన రైతులకు మంత్రి న్యాయం చేస్తారని రైతులకు చెప్పి ఓ నాయకుడు రైతులను తరలించారు. అయితే, వారిని కలవకుండానే మంత్రి వెళ్లిపోయారు. దీంతో సోమవారం ఉదయం 10 గంటలకు నాదర్‌గుల్‌లోని కాసుబాగు, హర్డ్‌వేర్ పార్క్ రైతులతో కలిసి డిప్యూటీ సీఎం భూమిని పరిశీలిస్తారని నమ్మించారు. ఇది నమ్మిన రైతులు సోమవారం ఉదయం భూమి దగ్గర పడిగాపులు కాశారు. పొలాలకు సంబంధించిన కాగితాలు పట్టుకొని ఎదురుచూశారు. పది గంటల సమయంలో రైతులకు మరో నేత ఫోన్ చేసి మంత్రి పొలాల దగ్గరకు రావడం లేదని సమాచారం ఇచ్చారు.

మరో చోటకు వెళ్లినా అదే తీరు

నాదర్‌గుల్ బస్టాండ్‌లో భట్టి విక్రమార్క కలుస్తారని చెప్పడంతో రైతులు తిరిగి పది గంటలకు అక్కడికి చేరుకున్నారు. డిప్యూటీ సీఎం ఆదిబట్లకు రాగానే పోలీసులు అప్రమత్తం అయ్యారు. రైతులను అక్కడి నుంచి పంపించే ప్రయత్నం చేశారు. తమకు సమయం ఇచ్చిన తర్వాత ఎందుకు పొమ్మంటున్నారని రైతులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో పోలీసులకు రైతుల మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో భట్టి నాదర్‌గుల్ చౌరస్తాకు చేరుకున్నారు. అక్కడ కొందరు రైతులు భట్టి కారుకు అడ్డుగా వచ్చారు. వారితో మాట్లాడిన డిప్యూటీ సీఎం గుడి దగ్గరకు వస్తే మాట్లాడుకుందామని చెప్పారు. అక్కడ కూడా రైతులకు నిరాశే ఎదురైంది. ఆ తర్వాత ఎవరైనా ఒకరు వచ్చి వినతిపత్రాలు ఇవ్వాలని మంత్రి నుంచి పిలుపొచ్చింది. ఆ వెంటనే మనసు మార్చుకుని తర్వాత తీసుకుంటామని చెప్పి అక్కడి నుంచి భట్టి వెళ్లిపోవడంతో రైతులు తీవ్ర అగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

హైదరాబాద్‌లో కాగ్నిజెంట్ విస్తరణ

- దాదాపు 15 వేల మంది యువతకు ఉద్యోగాలు
- అమెరికాలో సీఎంతో కంపెనీ ప్రతినిధుల చర్చలు

హైదరాబాద్, ఆగస్టు 5(నమస్తే తెలంగాణ): ప్రపంచస్థాయిలో ఐటీ రంగంలో పేరొందిన కాగ్నిజెంట్ కంపెనీ తెలంగాణలో భారీ విస్తరణ ప్రణాళికతో ముందుకు వచ్చింది. హైదరాబాద్ లో దాదాపు 15 వేల మందికి ఉద్యోగాలు కల్పించేలా కొత్త సెంటర్ నెలకొల్పనున్నట్టు ప్రకటించింది. ఇరవై వేలమంది ఉద్యోగులుండేలా పది లక్షల చదరపు అడుగుల స్థలంలో ఈ సెంటర్‌ను స్థాపించనుంది. అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు సోమవారం కాగ్నిజెంట్ సీఈవో రవికుమార్‌తోపాటు కంపెనీ ప్రతినిధి బృందంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జరిగిన చర్చల్లో ఈ ఒప్పందం కుదిరింది. టెక్నాలజీ, ఇన్నోవేషన్ హబ్‌గా సత్తా చాటుకుంటున్న హైదరాబాద్‌లో తమ కంపెనీని విస్తరించడం సంతోషంగా ఉందని కాగ్నిజెంట్ సీఈవో ఎస్ రవికుమార్ తెలిపారు. ఐటీ రంగానికి మరింత అనుకూలమైన వాతావరణం కల్పించేందుకు తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నదని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కాగ్నిజెంట్ కంపెనీ కొత్త సెంటర్ ఏర్పాటుతో ప్రపంచ టెక్నాలజీ కంపెనీలన్నీ హైదరాబాద్‌ను తమ ప్రధాన గమ్యస్థానంగా ఎంచుకుంటాయని అభిప్రాయపడ్డారు.

మెడికల్ సీట్లలో లోకల్ గోల్‌మాల్!

మొదటిపేజీ తరువాయి...

నుంచి ఇంటర్మీడియట్ వరకు ఎక్కడ చదివితే అక్కడ స్థానికులుగా పరిగణిస్తామని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. 2023-24 విద్యా సంవత్సరం వరకు 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఏడేండ్ల కాలంలో గరిష్ఠంగా నాలుగేండ్లు ఎక్కడ చదివితే అక్కడ స్థానికులుగా పరిగణలోకి తీసుకునేవారు. స్థానికతపై ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి చేసిన మార్పులతో తెలంగాణ వారికే ఎక్కువ అన్యాయం జరుగుతుందన్న ఆందోళన వ్యక్తమవుతున్నది.

ప్రైవేటు కాలేజీలకు లబ్ధి

ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో తాజాగా పెట్టిన స్థానికత నిబంధనతో హైదరాబాద్‌లో చదివిన ఏపీ విద్యార్థులు తెలంగాణలో స్థానికులుగా ఉంటారు. ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లోని చాలా ప్రాంతాలకు చెందిన వారు విజయవాడ, గుంటూరులలో ఇంటర్మీడియట్ చదువుతారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా పెట్టిన స్థానిక నిబంధనలతో ఇలా ఇంటర్మీడియట్ కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లిన వారికి స్థానికత కోటా ఉండడంలేదు. తెలంగాణలో పుట్టి పెరిగి రెండేండ్ల ఇంటర్మీడియట్ కోసం ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లిన వారు సొంత రాష్ట్రంలో స్థానికులు కాకుండా పోతున్నారు. ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రైవేటు కాలేజీలకు మేలు చేసేందుకే స్థానికతపై రాష్ట్ర ప్రభుత్వం కొత్త నిబంధనలను పెట్టిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానికత నిర్ధారణ కోసం వైద్య, ఆరోగ్యశాఖ జారీ చేసినట్టు చెబుతున్న ఈ 33 జీవో ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ వెబ్‌సైట్‌లోనూ అందుబాటులో లేదని, పారదర్శకత లేకపోవడంతో ఈ జీవో అమలుపై అనేక అనుమానాలు ఉన్నాయని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వ చర్యలతో రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఎక్కువగా ఏర్పాటయ్యాయి. ఎంబీబీఎస్ సీట్లు బాగా పెరిగాయి. దీంతో ప్రైవేటు మెడికల్ కాలేజీల సీట్ల దందాకు అడ్డంకులు ఏర్పడ్డాయి. ప్రైవేటు కాలేజీలు గతంలో ఒక్కో సీటు కోసం కోట్ల రూపాయలు వసూలు చేసేవి. ప్రభుత్వ మెడికల్ కాలేజీలు పెరిగిన తర్వాత ఈ ధరలు తగ్గాయి. స్థానికత కోటాలో ఎక్కువ మందికి అవకాశం ఇస్తే ప్రైవేటు కాలేజీల్లో బీ క్యాటగిరీ సీట్లకు పోటీ పెరుగుతుందని, ఇది ప్రైవేట్ కాలేజీలకు మేలు చేస్తుందని విద్యార్థులు చెప్తున్నారు.

ఏపీ విద్యార్థుల కోసమేనా?

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం హైదరాబాద్ ఉమ్మడి రాజధాని గడువు ఈ ఏడాది జూన్‌తో ముగిసింది. విద్యా సంస్థల్లో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకు కోటాలోనూ ఇదే అమలు కానుంది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిష్ఠాత్మక కాలేజీలు లేనందున అక్కడి విద్యార్థులకు మెడికల్ ఎడ్యుకేషన్‌లో అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీవో 33ను తీసుకువచ్చినట్లు స్పష్టమవుతున్నది.

ఆంధ్రా లాబీతోనేనా?

ప్రభుత్వం కొత్తగా విడుదల చేసిందని చెప్తున్న నూతన మార్గదర్శకాల వెనక ఆంధ్రా లాబీ ఉన్నదనే ప్రచారం జోరుగా సాగుతున్నది. ఈ విషయంలో ఆంధ్రా విద్యాసంస్థల యాజమాన్యాలు కొన్ని తీవ్రస్థాయిలో లాబీ చేసినట్టు తెలంగాణ మేధావుల్లో విస్తృతస్థాయి చర్చ కొనసాగుతున్నది. ఇప్పటివరకు అమలైన స్థానికత నిబంధనలను యథావిధిగా కొనసాగిస్తే తెలంగాణ రాష్ట్ర విద్యార్థులకు ఎలాంటి నష్టం వాటిల్లే ప్రస్తక్తే లేదు. కానీ ప్రభుత్వం ఆ నిబంధనలను ఇప్పటికిప్పుడు ఎందుకు మార్చింది? అందులో అంతర్యమేంటని? తెలంగాణ విద్యావేత్తల్లో చర్చ జరుగుతున్నది.

47,356 మంది అర్హత

ప్రస్తుత విద్యా సంవత్సరంలో రాష్ట్రంలో 30 ప్రభుత్వం, 30 ప్రైవేటు మెడికల్ కాలేజీలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో 8,315 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ కాలేజీల్లో నేషనల్ పూల్ కింద 617 సీట్లు భర్తీ చేస్తారు. మిగిలిన సీట్లను రాష్ట్రంలో కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం భర్తీ చేస్తుంది. రాష్ట్రంలో ఈసారి 77,848 మంది నీట్ యూజీ పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 47,356 మంది అర్హత సాధించారు. రాష్ట్రంలో ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లలో నేషనల్ కోటా మినహా మిగిలిన కన్వీనర్ కోటా సీట్లన్నీ రాష్ట్ర విద్యార్థులకే దక్కనున్నాయి. రాష్ట్ర పునర్విభజన చట్టం మేరకు పదేళ్ల వరకు అమలైన 15 శాతం అన్‌రిజర్వ్‌డ్ కోటా సీట్లు ఈ ఏడాది నుంచి రద్దయ్యాయి. రాష్ట్రంలో 2014కు ముందు ఏర్పాటైన అన్ని వైద్య కళాశాలల్ల